# ప్రత్యక్ష సాక్షి
తెలుగు దినపత్రిక

RNI No.APTEL/2011/38267



విలేకరులు కావలెను

ప్రత్యక్ష సాక్షి దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ ప్రాంతంలోని అన్ని జిల్లాలు మరియు నియోజకవర్గాల నుంచి పనిచేయుటకు విలేకరులు కావలెను. ప్రశ్నించే తత్వంతో పాటు నిజాన్ని నిర్భయంగా రాయగలిగే సత్తా ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి : సెల్ : 99892 88546



సంపుటి : 16 సంచిక : 045 ఆదివారం 23-08-2026

ఎడిటర్ : కందుకూరి పరమేశ్వర్‌రావు, M.A. పేజీలు : 4 వెల : రూ2/-


## వరంగల్ వెస్ట్ నియోజకవర్గ (జి డబ్ల్యూ ఎం సి) 26 డివిజన్ల ప్రెసిడెంట్ నియామకము..

### ఉత్తర్వులు జారీ చేసిన టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్



సాయి... ప్రత్యక్ష సాక్షి వరంగల్ బ్యూరో చీఫ్

వరంగల్ వెస్ట్ నియోజకవర్గ (జి డబ్ల్యూ ఎం సి) 26 – డివిజన్ ప్రెసిడెంట్ల నియా మకాన్ని ఆమోదించిన టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్..ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసిన డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి.వరంగల్ వెస్ట్ నియోజక వర్గ పరిధిలోని వివిధ (జి డబ్ల్యూ ఎం సి ) 26 నూతన డివిజన్ల ప్రెసిడెంట్ల నియామక ప్రతిపాదనలకు టీపీసీసీ ఆమోదం తెలిపింది. ఈ మేరకు డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు.ఈ నియామకాలు తక్షణమే అమలులోకి వస్తాయని ఉ త్తర్వుల్లో పేర్కొన్నారు. నూతనంగా నియమితులైన డివిజన్ ప్రెసిడెంట్లు పార్టీ బలోపేతానికి, క్షేత్రస్థాయి నుండి సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయడానికి అంకితభావంతో కృషి చేయాలని పార్టీ నాయకత్వం ఆకాంక్షించింది. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన డివిజన్ ప్రెసిడెంట్లకు హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తమ హృదయపూర్వక అభినం దనలు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు.

నియమితులైన వరంగల్ వెస్ట్ నియోజకవర్గ(జి డబ్ల్యూ ఎం సి) డివిజన్ ప్రెసిడెంట్ల వివరాలు ...

1. డివిజన్ 4: బాషబోయిన శ్రీధర్ యాదవ్
2. డివిజన్ 5: సోమ కరుణ శ్రీ
3. డివిజన్ 6: మహమ్మద్ ఆజం
4. డివిజన్ 7: పోలు లక్ష్మీనారాయణ
5. డివిజన్ 8: సీతా శ్యామ్
6. డివిజన్ 9: భీమా వినయ్
7. డివిజన్ 10: మహమ్మద్ ఫిరోజ్ ఖాన్
8. డివిజన్ 11: ఎండీ. సమద్
9. డివిజన్ 29: బొమ్మ సురేష్
10. డివిజన్ 30: రాజ్ కుమార్
11. డివిజన్ 31: సత్తు రమేష్
12. డివిజన్ 47: దొంగల కుమార్
13. డివిజన్ 48: చందు
14. డివిజన్ 49: నాగపురి కరణ్
15. డివిజన్ 50: బషీర్
16. డివిజన్ 51: కరీం
17. డివిజన్ 52: తడుక సుమన్
18. డివిజన్ 53: ఎర్ర మహేం దర్
19. డివిజన్ 54: సుమన్
20. డివిజన్ 57: అశోక్ రెడ్డి
21. డివిజన్ 58: తాళ్లపెల్లి సుధాకర్
22. డివిజన్ 59: దీపక్ రెడ్డి
23. డివిజన్ 60: బుస్స నవీన్
24. డివిజన్ 61: అర్కవత్ లక్ష్మణ్ నాయక్
25. డివిజన్ 62: పాలడుగుల ఆంజనే యులు
26. డివిజన్ 63: విజయశ్రీ రజాలి.

## అంగన్ వాడి చిన్నారులకు యూనిఫాంల పంపిణీ

### ముఖ్య అతిథిగా కాంగ్రెస్ రాష్ట్ర పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు

(ప్రత్యక్ష సాక్షి, కోరుట్ల)

కోరుట్ల పట్టణశిలోని 13వ వార్డు అంగన్ వాడీ కేంద్రంలో చిన్నారులకు యూనిఫాంలు కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు చిన్నారులకు అందజేశారు. ఈ కార్యక్రమశిలో ముఖ్యఅతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ అంగన్ వాడి కేంద్రంలో చిన్నారులకు ప్రభుత్వం అన్ని వస్తువులు కల్పించిందని అందులో భాగంగానే నేడు ఉచిత యూనిఫాంల పంపిణీ చేపట్టడం జరిగిందన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం తో పాటు ఉచితంగా యూనిఫాంల అందిస్తుందని ఈ సదవకాశాన్ని ప్రతి ఒక్క చిన్నారులు ఉపయోగించు కోవాలని



తల్లిదండ్రులకు సూచించారు. ఈకార్యక్రమం లో అంగన్వాడి కేంద్ర నిర్వాహకులు, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## 1 మెగావాట్ పీఎం-కుసుమ్ సోలార్ ప్లాంట్ ప్రారంభం..



ప్రత్యక్ష సాక్షి జగిత్యాల

జగిత్యాల జిల్లా ఆరెపేట గ్రామంలో 1 మెగావాట్ పీఎం-కుసుమ్ సోలార్ ప్లాంట్లు సమీప 33/11 కేవీ సబ్స్టేషన్ చౌలమద్ది వద్ద జగిత్యాల ఎన్పీడీసీఎల్ ఎస్ఈ బొంకూరి సుదర్శనం గ్రిడ్ కు విజయవంతంగా అనుసంధానంచేసి సాంకేతిక పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ సుదర్శనం మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయడానికి పీఎం-కుసుమ్ పథకం ఎంతో లాభదాయకమని, ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పుష్కలమైన అవకాశాలు కల్పిస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు.

తెలంగాణ రాష్ట్రంలో నేటి వరకు అన్నదాతగా ఉన్న రైతన్న విద్యుత్ ప్రదాతగా మారి హరిత ఇంధన ఉత్పత్తిలో భాగస్వామ్యం కావడం సంతోషకరమైన విషయం అని పేర్కొన్నారు. జగిత్యాల జిల్లాలో 23 దరఖాస్తు దారుల్లో నేటి వరకు ఐదు పీఎం కుసుమ్ సోలార్ ప్రాజెక్టులు గ్రిడ్ కు అనుసంధానం జరిగిందని, వీటి సామర్థ్యం 5 మెగావాట్లు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిస్కం డీఈలు మధుసూదన్, గంగారాం, శ్రీనివాస్ గౌడ్, ఏడీఈ లు రవి, శ్రీధర్, జీటి వెంకటేశ్వర్లు, ఏఈలు రమేష్, శ్రీనివాస్, జ్యోతి, ప్లాంట్ యజమాని పుడుకరం నరసింహారెడ్డి, ఏలేటి నరేందర్ రెడ్డి, హర్షిత్ ఇన్రా సురేందర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం యోగి సహా 52మంది నేతలకు బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు..



(ఢిల్లీ)

వచ్చే ఏడాది ఉత్తర్‌ప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కీలక నేతల భద్రతపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 52 మంది రాజకీయ నాయకులకు బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు సమకూర్చినట్లు సమాచారం. ఈ జాబితాలో సీఎం యోగి ఆదిత్యనాథ్, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, బీఎస్పీ అధినేత్రి మాయావతి సహా పలువురు నేతలు ఉన్నట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. ఒక్కో బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధర రూ.10 లక్షలు ఉంటుందని అధికారిక వర్గాలు వెల్లడించాయి.

వీటిని పొందిన నేతల లిస్టులో 11 మంది రాష్ట్ర మంత్రులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోని మరో 98 మంది నేతలు, ప్రముఖ వ్యక్తులకు వివిధ స్థాయుల్లో భద్రత కల్పించనున్నట్లు తెలిపాయి. మరోవైపు ఎన్నికల సన్నాహాల్లో భాగంగా వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితిని, అభ్యర్థుల అవకాశాలను అంచనా వేయడానికి భాజపా సర్వేలు నిర్వహిస్తోంది.

## రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సహకరించాలి..

### రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్





(సిద్దిపేట)

తెలంగాణ సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. 'పల్లె పల్లెకు పొన్నం అన్న -- పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో భాగంగా అక్కన్నపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షిస్తున్న 'వికసిత్ భారత్' లక్ష్యం నెరవేరాలంటే అన్ని రాష్ట్రాల అభివృద్ధి అవసరమని, అందులో భాగంగానే తెలంగాణ ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్ 2047' ప్రణాళికతో ముందుకెళ్తోందని చెప్పారు. రాష్ట్రానికి పెట్టుబడులు తేవడానికి, అంతర్జాతీయ వేదికలపై తెలంగాణ సామర్థ్యాన్ని చాటడానికి ముఖ్యమంత్రి విదేశీ పర్యటనలు చేపట్టాలనుకుంటే కేంద్ర ప్రభుత్వం అనుమతులు నిరాకరించడం బాధాకరమని, ఇది కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని ధ్వజమెత్తారు. రాష్ట్రానికి రావాల్సిన మెట్రో రైలు, ఔటర్ రింగ్ రోడ్డు, నిధులు, ప్రాజెక్టులను తీసుకురావడంలో రాష్ట్ర బీజేపీ నాయకులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. "రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రాన్ని ప్రశ్నించే ధైర్యం బీజేపీ నేతలకు లేదా ?" అని ప్రశ్నించారు. బీజేపీ నాయకులు తమ ఐక్యతను కేంద్రం నుంచి తెలంగాణకు నిధులు, ప్రాజెక్టులు సాధించడంలో చూపించాలని హితవు పలికారు.

**ఇంటింటికీ సంక్షేమం – క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం..**

హుస్నాబాద్ నియోజకవర్గంలోని 183 గ్రామాల్లో ప్రజాసమస్యలను నేరుగా తెలుసుకొని, అక్కడికక్కడే పరిష్కరించేందుకే 'పల్లె పల్లెకు ప్రజా పాలన' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. ప్రతిరోజూ 5 నుంచి 6 గ్రామాల్లో పర్యటిస్తూ వ్యవసాయం, ఉపాధి, విద్యుత్, రోడ్లు, తాగునీరు, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు వంటి అంశాలపై ప్రజల అభిప్రాయాలు స్వీకరిస్తున్నామని, అధికారులతో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

## సురవరం ఆశయాలను, లక్ష్యాలను కొనసాగించాలి..

### సిపిఐ సీనియర్ నేత,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పిలుపు



(ప్రత్యక్ష సాక్షి, కరీంనగర్)

పేద ప్రజల పక్షపాతిగా అలుపెరగని పోరాటాలు చేసి కార్మికుల,కర్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న మహోన్నతమైన గొప్ప మేధావిగా, కమ్యూనిస్టు యోధుడుగా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న సిపిఐ అగ్ర నేత సురవరం సుధాకర్ రెడ్డి అని సిపిఐ సీనియర్ నాయకులు,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి కొనియాడారు. కరీంనగర్ లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ లో సిపిఐ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమం నిర్వహించడంతో సురవరం చిత్రపటానికి చాడ వెంకటరెడ్డి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ వర్ధంతికి ముఖ్య అతిథిగా హాజరైన చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ సురవరం సుధాకర్ రెడ్డి కుటుంబమంతా కమ్యూనిస్టు భావజాలం,అభ్యుదయ భావాలతో నిండి ఉందని,ఆయన పెద్దనాన్న సురవరం ప్రతాప రెడ్డి నిజాం కాలంలో తెలుగు సాహిత్యంతో గోల్కొండ పత్రికను స్థాపించారని,సాయుధ పోరాట సమయంలో ఆయన కుటుంబమంతా పోరాటంలో పాల్గొన్నదని,ఆయన వారసత్వాన్ని సుధాకర్ రెడ్డి పుణికిపుచ్చుకున్నారని తెలిపారు.

విద్యార్థి దశలోనే ఏఐఎస్ఎఫ్ నాయకునిగా ప్రస్థానం ప్రారంభించిన సురవరం సుధాకర్ రెడ్డి విద్యార్థి,యువజన సంఘాలకు రాష్ట్ర,జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ అంచెలంచెలుగా ఎదిగారని పేరొన్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సిపిఐ రాష్ట్రకార్యదర్శిగా పనిచేసి నిరంతరం ప్రజల పక్షాన పోరాటాలు నిర్వహించే నాయకునిగా ఎదిగారని,కరువుకు నిలయమైన రాష్ట్రంలో సాగు,త్రాగు నీరు కోసం జరిగిన అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారని, విద్యుత్ చార్జీల పెంపుకు నిరసనగా జరిగిన ఉద్యమంలో బాష్పవాయువు, లాఠీచార్జిలు, ఫైరింగ్ కు కూడా ఆయన బెదరకుండా ముందుండి నిలిచారని గుర్తు చేశారు.ప్రజాపోరాటాలలో పార్లమెంటరీ వ్యవస్థలలో పేద ప్రజల పక్షాన నిలబడి పోరాడిన నిబద్ధతగల కమ్యూనిస్టు అగ్ర నాయకునిగా ఎదిగారన్నారు. 2004లో యూపీఏ వన్ ప్రభుత్వ హయంలో ఆయన నల్గొండ పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికై పార్లమెంట్ సమావేశాల్లో 2జి స్పెక్ట్రమ్ కుంభకోణం వెలికి తీయడం,కోట్ల రూపాయల నల్లధనాన్ని స్విస్ బ్యాంకుల్లో ఉన్నాయని పార్లమెంట్ లో లేవనెత్తిన గొప్ప మేధావి అని అన్నారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ గా కార్మికులకు అండగా నిలిచారని వారి హక్కులను కాపాడారని,చట్టాలను రక్షించారని అన్నారు.


గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టం, సమాచార హక్కు చట్టం,భూ సంస్కరణల చట్టం అమలు,చేయడంలో కీలక భూమిక పోషించారని గుర్తు చేశారు. సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత దేశంలో అన్ని రాష్ట్రాల్లో పార్టీ విస్తరణకు విశేష కృషి చేశారని,అనారోగ్యంతో ఉన్నా కూడా పార్టీ కార్యక్రమాల్లో,బహిరంగ సభల్లో,సెమినార్ల లో పాల్గొనే వారని అలాంటి గొప్ప వ్యక్తి సురవరం అని ఆయన ఆశయాలను,లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లేందుకు నేటి తరం కమ్యూనిస్టులు సిద్ధం కావాలని చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి,జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్,బోయిని అశోక్,టేకుమల్ల సమ్మయ్య,న్యాలపట్ల రాజు,సిద్ధిపేట జిల్లా సహాయ కార్యదర్శి గడిపే మల్లేష్,జిల్లా కౌన్సిల్ సభ్యులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్,పైడిపల్లి రాజు,బామండ్లపెల్లి యుగేందర్,మచ్చ రమేష్,దుడ్డేల సమ్మయ్య, బోనగిరి మహేందర్,బూడిద సదాశివ,పిట్టల శ్రీనివాస్,నాయకులు నునావత్ శ్రీనివాస్,అల్లేపు రాజు,సదానందం తదితరులు పాల్గొన్నారు.

## ఒక్క రోజే.. 400 కేసుల పరిష్కారం..

(ఢిల్లీ)

ఒక్క రోజులోనే సుప్రీంకోర్టు ప్రత్యేక లోక్ అదాలత్ 400 కేసులను పరిష్కరించింది. వేగవంతమైన న్యాయపరిష్కారాలు అందించేందుకు సర్వోన్నత న్యాయ స్థానం మూడు రోజుల ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. 'సమాధాన్ సమరోహ్ 2026' పేరుతో చేపట్టిన ఈ ప్రత్యేక డ్రైవ్ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ మార్గదర్శకత్వంలో పని చేస్తోంది. ఇందులో భాగంగా మొదటి రోజైన శుక్రవారం 400 కేసుల్లో పరిష్కారాలు చూపింది. ఆదివారంతో ఈ లోక్ అదాలత్ ముగియనుంది.

పెండింగ్‌లో ఉన్న వివాదాలను స్నేహపూర్వకంగా పరిష్కరించుకోవడానికి వీలు కల్పించడమే ఈ ప్రత్యేక లోక్ అదాలత్ లక్ష్యమని సుప్రీంకోర్టు వెల్లడించింది. సర్వోన్నత న్యాయస్థానానికి చెందిన ఇద్దరు సిట్టింగ్ న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులు, అడ్వొకేట్-ఆన్-రికార్డ్, ఇతర న్యాయవాదులతో కూడిన 16 ప్రత్యేక



లోక్ అదాలత్ బెంచ్‌లు ఈ డ్రైవ్‌లో పాల్గొన్నట్లు తెలిపింది. లోక్ అదాలత్‌లో మొదటి రోజు 600కు పైగా కేసులు పరిష్కారం కోసం లిస్ట్ కాగా.. వాటిలో 400కు పైగా కేసులను సామరస్యంగా పరిష్కరించినట్లు పేర్కొంది. వీటిలో వైవాహిక, ఆస్తి, వాహన ప్రమాద క్లెయిమ్‌లు, నష్టపరిహారం, కార్మిక వివాదాలు వంటివి ఉన్నాయి.

# తత్త్వం, తపన, త్యాగం సమ్మిళిత వ్యక్తిత్వం బి.ఎస్. రాములు

## సాహిత్యం నుంచి సామాజిక పోరాటం వరకు సాగిన బహుముఖ ప్రజ్ఞాశాలి జీవన ప్రస్థానం



తెలుగు సాహితీ వినీలాకాశంలో కొందరు రచయితలు కాల ప్రవాహంలో తమ కలాల ముద్రలు వేస్తే, మరికొందరు తమ జీవితాలనే ఒక మహోజ్వల భావజాల విప్లవంగా, అక్షర చైతన్య స్రవంతిగా మలుచుకుంటారు. అక్షరాన్ని ఆయుధంగా, తత్త్వాన్ని జీవన దృక్పథంగా, సమసమాజ నిర్మాణాన్ని శ్వాసగా భావించి తెలుగు నేలపై బహుజన తాత్విక పతాకను సమున్నతంగా ఎగరేసిన అపురూప మేధో ద్రష్ట బి.ఎస్. రాములు. తత్త్వచింతన, సృజనాత్మక సాహిత్య విన్యాసం, శాస్త్రీయ సామాజిక విశ్లేషణ, పీడిత బహుజన వర్గాల అంతశ్చేతన, ప్రజాస్వామిక ఉద్యమ కార్యాచరణ---ఈ పంచముఖ జీవన ప్రవాహాల సమాహారమే ఆయన అస్తిత్వం. జగిత్యాల పురిటిగడ్డ నుంచి మొదలైన ఆయన ప్రస్థానం, పల్లె పదాల మట్టి సువాసనల నుంచి విశ్వవిద్యాలయాల తాత్విక పరిశోధనల వరకు, అణగారిన జన సముద్రాల ఆర్తనాదాల నుంచి శాసన, విధాన రూపకల్పనల వరకు అప్రతిహతంగా సాగింది. 1949 ఆగస్టు 23న సాధారణ నిమ్న మధ్యతరగతి గర్భాన జన్మించిన రాములు, తన స్వయంకృషితో, జ్ఞాన తృష్ణతో, మొక్కవోని సాధనతో సమకాలీన తెలుగు సాహిత్య, సామాజిక జగత్తులో ఎవరూ అధిరోహించలేని ఒక విశిష్ట శిఖరంగా అవతరించారు.

కథకు జన్మనిచ్చే నేల జీవితపు వేదనలతో తడిసిముద్దైనప్పుడే ఆ కథ విశ్వజనీనమవుతుంది. రాములు గారి బాల్యం అలాంటి జీవన సత్యాల పాఠశాల. తల్లి ఒడిలో నేర్చుకున్న అమాయక జానపద కథలు, పల్లె రచ్చబండల వద్ద జానపద కళాకారులు గానం చేసిన వీరగాథలు, బుర్రకథలు, ఒగ్గుకథల నాదాలు ఆయన లేత హృదయంలో కథాకళా విత్తనాలను నాటాయి. తల్లి చెప్పిన కథలను తన స్వకపోల కల్పనలతో, వర్ణనాత్మక ఊహాశక్తితో మరింత అందంగా విస్తరించి తోటి బాల్య మిత్రులను మంత్రముగ్ధులను చేయడం ఆయనలోని పుట్టుకతో వచ్చిన కథకుడి ప్రతిభకు నిదర్శనం. అయితే ఆయన జీవన పథం పూలబాట కాదు; కటిక దారిద్ర్యం, సామాజిక అభద్రతల నడుమ సాగిన నిరంతర ఆత్మశోధన. ఒకవైపు చదువుకోవాలనే అణచలేని జ్ఞానదాహం, మరోవైపు పూట గడవని జీవన పోరాటం. పత్రికా ఏజెన్సీని నిర్వహిస్తూ, వచ్చిన కొద్దిపాటి ఆదాయాన్ని పుస్తకాల కొనుగోలుకు వెచ్చించి, స్వయంగా ఒక విజ్ఞాన భాండాగారాన్ని నిర్మించుకున్న ఆయన అక్షర తపన అనితరసాధ్యమైనది. ధర్మపురి క్షేత్రంలో వికసించిన సాహిత్య, సాంస్కృతిక సమ్మేళనాలు, పండిత-సామాన్య జన సంభాషణలు ఆయన ఆలోచనా పరిధిని విస్తృతపరచి, తాత్విక సమన్వయానికి తొలి పునాదులు వేశాయి.

జీవితానుభవమే అసలైన సాహిత్యానికి ముడిసరుకని రాములు గాఢంగా విశ్వసించారు. సాంఘిక సంక్షేమ శాఖలో వసతిగృహ సంక్షేమాధికారిగా ఆయన చేపట్టిన ఉద్యోగం కేవలం ఒక జీవనోపాధి కాదు; అణగారిన వర్గాల అంతరంగాన్ని అధ్యయనం చేసిన ఒక ప్రత్యక్ష సామాజిక ప్రయోగశాల. అప్పటి ఇరవై సూత్రాల కార్యక్రమంలో భాగంగా 25 సీట్ల పరిమిత వసతిగృహాలను 100 సీట్లకు విస్తరించే మహత్తర బాధ్యతను ఆయన తన భుజస్కంధాలపై వేసుకున్నారు. మానేరు జలాశయ పరివాహక ప్రాంతంలోని మారుమూల పల్లెలకు, కొండకోనల గుండా సైకిల్‌పై నిత్యం ప్రయాణిస్తూ, సుమారు 40 నుండి 50కి పైగా దళిత, బహుజన గ్రామాలను ఆయన స్వయంగా సందర్శించారు. అక్షరానికి ఆమడదూరంలో ఉన్న బడుగుల పూరిగుడిసెల్లోకి వెళ్లి, తల్లిదండ్రులను ఒప్పించి పిల్లలను వసతిగృహాలకు చేర్పించిన ఆ క్షేత్రస్థాయి పరిశీలన ఆయనలోని రచయితను సమాజ శాస్త్రవేత్తగా తీర్చిదిద్దింది. ఆ మట్టిమనుషుల కన్నీళ్లు, చెమట వాసనలు, ఆకలి కేకలు, ఆత్మగౌరవ పోరాటాలు ఆయన కలంలో అగ్నికణాలై ప్రతిఫలించాయి.

కథానిలయం చారిత్రక రికార్డుల ప్రకారం 1980 డిసెంబరు 1న ఆయన తొలి కథ అచ్చురూపం దాల్చడంతో తెలుగు కథా జగత్తులో ఒక నూతన అధ్యాయం ఆరంభమైంది. ఆ వెనువెంటనే 1982లో వెలువడిన ఆయన సంచలనాత్మక నవల 'బతుకు పోరు' తెలుగు సాహిత్య యవనికపై ఒక విస్ఫోటనం. ఉత్తర తెలంగాణ పల్లెల్లో వేలాది కుటుంబాలను పొట్టనబెట్టుకుంటున్న బీడీ కార్మికుల కష్టాలను, విషపూరితమైన పొగాకు ధూళిలో క్షయవ్యాధితో నలిగిపోతున్న స్త్రీలు, పిల్లల దీన గాథలను, కమీషన్ల దోపిడీని, శ్రమదోపిడీ నడుమ సాగే అస్తిత్వ పోరాటాన్ని 'బతుకు పోరు' కళ్లకు కట్టింది. అచ్చమైన తెలంగాణ పలుకుబడితో, సహజమైన మాండలిక శోభతో, జీవద్భాషతో రచించిన ఈ నవల కార్మికవర్గ జీవన వాస్తవికతకు తిరుగులేని సజీవ దస్తావేజుగా నిలిచింది. కథకుడిగా ఆయన సామాన్యుడిని కథా పీఠంపై అధిష్ఠింపజేశారు. 'పాలు', 'కాలం తెచ్చిన మార్పు', 'గెలుచుకున్న జీవితం', 'చికాగోలో నానమ్మ' వంటి అనేక కథా సంపుటాలు ఆయన విస్తృత దృక్పథానికి నిదర్శనాలు. పల్లెల్లోని భూస్వామ్య పీడన మొదలుకొని, ఆధునిక సమాజంలోని సంక్లిష్ట మానవ సంబంధాల వరకు, విదేశాల్లో స్థిరపడిన వారి అంతర్మథనం వరకు ఆయన కలం స్పృశించని కోణం లేదు. 'పాలు' వంటి కథలు విశ్వవిద్యాలయాల స్థాయి పరిశోధనలకు వస్తువై, పలు ఉన్నత విద్యా పాఠ్యాంశాల్లో చేర్చబడి తెలుగు కథా వైశిష్ట్యాన్ని చాటిచెప్పాయి.

బి.ఎస్. రాములు కేవలం అక్షరాలను పేర్చే శబ్ద శిల్పి మాత్రమే కాదు; భారతీయ సామాజిక మూలాలను సమగ్రంగా శోధించిన యుగకర్త, సామాజిక తత్వవేత్త. కార్ల్ మార్క్స్ వర్గపోరాట దృక్పథం, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ రాజ్యాంగబద్ధ సామాజిక న్యాయ సిద్ధాంతం, గౌతమ బుద్ధుని కరుణా-ప్రజ్ఞా మార్గం, మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాస్వామిక బహుజన సమగ్రతా దృక్పథం---వీటన్నింటినీ భారతీయ భౌతిక వాస్తవాల గీటురాయిపై పరిశీలించి 'సమన్వయ తాత్వికత'ను ఆయన రూపొందించారు. ఆయన ప్రసిద్ధ తాత్విక గ్రంథం 'బహుజన తత్త్వం' తెలుగు నాట ఒక సరికొత్త మేధో విప్లవానికి నాంది పలికింది. ఆయన దృష్టిలో సిద్ధాంతం అనేది గ్రంథాలయాల్లో బందీగా ఉండే శుష్క సూత్రీకరణ కాదు; అది పీడిత ప్రజల దైనందిన జీవన అనుభవాలతో, సాంస్కృతిక పోరాటాలతో నిరంతరం సంభాషించే సజీవ ప్రస్థానం. ఆర్థిక అసమానతలతో పాటు కులపీడన, లింగ వివక్షల సమూల నిర్మూలన జరగనంతవరకు నిజమైన ప్రజాస్వామ్యం సాధ్యం కాదని ఆయన తన లోతైన విశ్లేషణల ద్వారా నిరూపించారు.

సాహిత్యం అనేది ఒక వ్యక్తిగత సాధన మాత్రమే కాదని, అది సామూహిక చైతన్య సాధనమని గుర్తించిన రాములు సంస్థాగత నిర్మాణంలోనూ అద్వితీయ ముద్ర వేశారు. 1990లో ఆయన స్థాపించిన 'విశాల సాహితి అకాడమీ' తెలుగు ప్రచురణా రంగంలో ఒక సువర్ణ అధ్యాయం. ఈ అకాడమీ ద్వారా సుమారు 190కి పైగా ప్రామాణిక గ్రంథాలను ప్రచురించి, వెలుగుచూడని ఎందరో ప్రతిభావంతులైన దళిత, బహుజన, మైనారిటీ, స్త్రీవాద రచయితలను వెలుగులోకి తెచ్చారు. విమర్శకులు పట్టించుకోని గ్రామీణ ప్రతిభకు వేదికలు కల్పించారు. కరీంనగర్ జిల్లా కథా సంపుటాలను వరుసగా వెలువరిస్తూ ప్రాంతీయ మాండలికానికి, గ్రామీణ సంస్కృతికి సాహితీ గౌరవాన్ని సమకూర్చారు. నిరంతరం సాహిత్య సదస్సులు, తాత్విక అధ్యయన తరగతులు, రచనా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తూ రెండు తరాల రచయితలను, ఆలోచనాపరులను ఆయన తీర్చిదిద్దారు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమ కాలంలో బి.ఎస్. రాములు ఆలోచనాధార ఉద్యమానికి తాత్విక దిక్సూచిగా నిలిచింది. ఆయన తన రచనలు, ప్రసంగాలు, మేధో సంభాషణల ద్వారా ఉద్యమాన్ని కేవలం భౌగోళిక డిమాండ్‌గా కాకుండా సామాజిక ప్రజాస్వామ్య ఆకాంక్షగా పరివర్తన చెందించారు. ఉద్యమ సమయంలో విస్తృత చర్చకు దారితీసిన 'తెలంగాణ తల్లి' రూపకల్పన భావనలో రాచరికపు ఆడంబరాలు కాకుండా బహుజన శ్రమజీవుల స్వరూపం, సహజ గ్రామీణ మాతృమూర్తి తత్త్వం ప్రతిబింబించాలని బలంగా ప్రతిపాదించారు. అంతేకాకుండా అణగారిన వర్గాల పిల్లలకు ప్రపంచ స్థాయి నాణ్యమైన విద్యావకాశాలు కల్పించేందుకు 'గురుకుల విద్యా విధానం' ఎంతటి కీలకమైనదో ప్రాథమిక దశలోనే స్పష్టమైన దృక్పథాన్ని అందించారు. సామాజిక సంక్షేమ నమూనాలు, బహుజన సాధికారతపై ఆయన వ్యక్తం చేసిన ఆలోచనలు ప్రభుత్వ విధానాలపై గాఢమైన ప్రభావాన్ని చూపాయి.

తెలంగాణ స్వరాష్ట్ర స్వప్నం సాకారమైన తరుణంలో, ఆయన మేధో సంపత్తిని, సామాజిక సమగ్ర దృష్టిని గుర్తించిన ప్రభుత్వం 2016 అక్టోబరులో ఆయనను తెలంగాణ రాష్ట్ర తొలి వెనుకబడిన తరగతుల (బీసీ) కమిషన్ చైర్మన్‌గా నియమించింది. ఆయనతో పాటు ప్రముఖ మేధావులు వకులాభరణం కృష్ణమోహన్‌రావు, ఈడిగ అంజనేయగౌడ్, జూలూరు గౌరీశంకర్ సభ్యులుగా నియమితులై మూడేళ్ల పదవీకాలంలో అనితరసాధ్యమైన కార్యాచరణ సాగించారు. అప్పటివరకు నామమాత్రంగా ఉన్న కమిషన్ పరిధిని దాటి, ఆయన నేతృత్వంలో కమిషన్ చారిత్రక, శాస్త్రీయ అధ్యయనాలకు శ్రీకారం చుట్టింది. 2017లో రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి, వేలాది మంది ప్రజలను కలిసి, బీసీ జాబితా పునర్వర్గీకరణపై, అత్యంత వెనుకబడిన తరగతులు (ఎంబీసీ), సంచార, అర్ధసంచార తెగల జీవన ప్రమాణాలపై అపూర్వమైన శాస్త్రీయ అధ్యయనాన్ని నడిపించారు. సమాజపు అట్టడుగున ఉన్న విస్మృత సముదాయాలను గుర్తించి, వారికి విద్యా, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో న్యాయబద్ధమైన వాటా కల్పించేందుకు సమగ్ర నివేదికలను ప్రభుత్వానికి సమర్పించి విధాన రూపకల్పనలో ఒక నూతన ప్రమాణాన్ని నెలకొల్పారు.

బి.ఎస్. రాములు రచనా పరంపర ఒక అనంత సాహిత్య మహాసాగరం. కథలు, నవలలు, సాహిత్య విమర్శలు, సామాజిక శాస్త్ర విశ్లేషణలు, తాత్విక సిద్ధాంత గ్రంథాలు, సంపాదకత్వాలు---ఇలా ప్రక్రియ ఏదైనా ఆయన కలం పట్టిన ప్రతి అక్షరం ఒక సామాజిక స్పృహను రగిలించింది. ఆయన కలం నుంచి జాలువారిన శతాధిక గ్రంథాలు తెలుగు సాహిత్యంలో ఒక చారిత్రక కాలానికి, ఒక నిర్దిష్ట భౌగోళిక సాంస్కృతిక జీవనానికి సజీవ దర్పణాలు. వయసుతో నిమిత్తం లేకుండా ఆయనలోని రచనా తపన ఇసుమంతైనా సడలకపోవడానికి 2025లో ఆవిష్కృతమైన ఆయన స్వీయచరిత్ర నాల్గవ సంపుటి 'అఖిల భారత పర్యటన' తిరుగులేని నిదర్శనం. యావత్ భారతీయ జనజీవనాన్ని, విభిన్న జాతుల సంస్కృతులను, సామాజిక వైరుధ్యాలను నిశితంగా పరిశీలిస్తూ సాగిన ఈ గ్రంథం ఆయన విస్తృత అధ్యయనశీలతకు, అలుపెరగని అన్వేషణకు మకుటాయమానంగా నిలుస్తుంది.

ఒక సాధారణ గ్రామీణ వాతావరణం నుంచి పుట్టి, అక్షర సాధనతో జ్ఞాన ప్రభంజనమై, ఆ జ్ఞానాన్ని పీడిత ప్రజల విముక్తి కొరకు ధారపోసిన బి.ఎస్. రాములు జీవితం ప్రతి ఆలోచనాపరుడికి ఒక నిత్య ప్రేరణా దీపం. మహాకవి గురజాడ అప్పారావు ప్రవచించిన "దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్" అన్న విశ్వజనీన మానవతావాదానికి, బాబాసాహెబ్ అంబేడ్కర్ అందించిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాల సామాజిక న్యాయ తత్వానికి, తెలంగాణ నేల సమరశీల మట్టివాసనకు సజీవ సంగమ రూపం ఆయన సాహిత్యం. ఆయన కేవలం పుస్తకాలు రాసిన రచయిత మాత్రమే కాదు; సమాజాన్ని ఆలోచింపజేసి నడిపించిన దార్శనికుడు. అక్షరం శ్రమజీవి కన్నీటిని తుడిచినప్పుడే సాహిత్యానికి సార్థకత అని, తాత్విక ఆలోచన ప్రజా చైతన్యంగా మారినప్పుడే సమాజంలో గుణాత్మక మార్పు సాధ్యమని, నిస్వార్థ త్యాగంతో కూడిన కార్యాచరణే మనిషి జన్మకు పరమావధి అని నిరూపించిన అక్షర తపస్వి ఆయన. ఆగస్టు 23న ఆయన జన్మదినోత్సవాన్ని స్మరించుకోవడం అంటే ఒక మహనీయుడిని కొనియాడడం మాత్రమే కాదు; విద్య, చైతన్యం, సమసమాజ నిర్మాణం, మానవతా విలువల పునరుజ్జీవనానికి మనల్ని మనం పునరంకితం చేసుకోవడమే.

రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్, 9440595494

# చింతకుంట చిన్నారులు పుస్తకావిష్కరణ..



(ప్రత్యక్ష సాక్షి, కరీంనగర్)

విద్యార్థులు ఆసక్తితో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని జిల్లా సెక్టోరియల్ అధికారి అశోక్ రెడ్డి అన్నారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల చింతకుంటలో శనివారం రోజున విద్యార్థులు రాసిన "చింతకుంట చిన్నారులు" అనే పిల్లల కథల పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశోక్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటినుండే ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని దానికి అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా చదవాలని, విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతకు పదును పెట్టడానికి కథా రచన ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. విద్యార్థులు ఏ విషయాన్నైనా అసక్తితో నేర్చుకుంటే ఉత్తమ ఫలితాలు పొందవచ్చని అందుకు నిదర్శనమే ఈ గురుకుల బడిపిల్లలు రాసిన ' చింతకుంట చిన్నారుల' పుస్తకమని అన్నారు. పాఠశాలకు చెందిన 38 మంది విద్యార్థులు రాసిన కథలను తెలుగు ఉపాధ్యాయురాలు చిందం అన్నపూర్ణ పుస్తకరూపంలో తీసుకురావడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జోనల్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, మండల విద్యాధికారి ఆనందం, డిగ్రీ ఉపన్యాసకులు ఎర్రోజు వెంకటేశ్వర్లు, ప్రముఖ బాలసాహితీవేత్త గరిపెల్లి అశోక్, పుస్తక పరిచయ కర్త కందుకూరి భాస్కర్, వైస్ ప్రిన్సిపాల్ ఇందిరాదేవి పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్, సెక్రటరీ, అలవాల భీమేశ్వర్, కమటం రాజమల్లయ్య, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి శ్రీధర్‌బాబుపై వ్యాఖ్యలు సహించేది లేదు : కాంగ్రెస్ నేతల హెచ్చరిక

లక్ష్మణ్ ప్రత్యక్ష సాక్షి మంథని

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి, మంథని ఎమ్మెల్యే డి. శ్రీధర్‌బాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు తన వైఖరిని మార్చుకోవాలని, నోరు అదుపులో పెట్టుకోకపోతే తగిన గుణపాఠం చెబుతామని కాంగ్రెస్ శ్రేణులు తీవ్రస్థాయిలో హెచ్చరించాయి. రామగిరి మండలం బేగంపేట్ ఎక్స్‌రోడ్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ మాట్లాడారు. న్యాయవాద దంపతులు గట్టు వామన్‌రావు దంపతుల హత్యకేసు విచారణలో భాగంగా సీబీఐ విచారణకు హాజరైన పుట్ట మధు, తన రాజకీయ ఉనికి కోల్పోతాననే తీవ్ర ఫ్రస్ట్రేషన్‌లోనే మంత్రిపై మతిభ్రమించి ఆరోపణాలు చేస్తున్నారని విమర్శించారు.



వందల కోట్ల రూపాయల నిధులతో శ్రీధర్‌బాబు మంథని నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుంటే ఓర్వలేకనే ఈ వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రాంతాన్ని ఇసుక, మట్టి మాఫియాలకు అడ్డాగా మార్చిన ఘనత పుట్ట మధుదేనని ఆరోపించారు. మంత్రి శ్రీధర్‌బాబు నాయకత్వంలో నియోజకవర్గం సుభిక్షంగా ఉందని, బీఆర్ఎస్ నాయకులు తమ పద్ధతి మార్చుకోకపోతే ప్రజలే తరిమితరిమి కొడతారని స్పష్టం చేశారు. ఈ ప్రెస్‌మీట్‌లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రొడ్డ బాపన్న పటేల్, పిసిసి నాయకులు, స్థానిక సర్పంచ్‌లు మరియు కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మంథని మున్సిపాలిటీ పరిధిలో చేయూత పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ : మున్సిపల్ చైర్మన్, కమీషనర్

టీ సత్యనారాయణ గౌడ్ ప్రత్యక్ష సాక్షి రిపోర్టర్ రూరల్ మంథని

మంథని మున్సిపాలిటీ పరిధిలో అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్ రకాల చేయూత సామాజిక భద్రత పింఛన్ల కోసం దరఖాస్తులను స్వీకరణ. చేయూత పింఛన్ పొందేందుకు అర్హత ఉన్న వారు 2026 ఆగస్టు 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని అలాగే అర్హులైన వారు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులు తమకు సంబంధించిన అవసరమైన ధ్రువపత్రాలతో మున్సిపల్ కార్యాలయంలో సంబంధిత సిబ్బందిని సంప్రదించి దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోగలరు. అందిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు




పేర్కొన్నారు. మంథని మున్సిపాలిటీ పరిధిలో చేయూత పింఛన్‌కు అర్హత ఉన్నప్పటికీ ఇప్పటివరకు పింఛన్ పొందని వారు ఆగస్టు 30లోపు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని వారు కోరారు..

# ఎం ఆర్ పి ఎస్ ఎం ఎస్ పి మండలాల కమిటీల సమావేశం..








యాదవరావు ప్రత్యక్ష సాక్షి పోతంగల్

నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గ కోటగిరి పోతంగల్ ఉమ్మడి మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా ఇంచార్జ్ మాసాయిపేట యాదగిరి మాదిగ. అనంతరం నూతన మండల కమిటీలను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ గత ముప్పై ఏళ్ల సుదీర్ఘ పోరాట ఫలితంగా మాదిగలు మాదిగల కోసమే కాదు 59 సంబండా ఉప కులాల కొరకు మంద కృష్ణ మాదిగ పోరాటం చేసిన వ్యక్తి ఆయన ద్వారా వర్గీకరణ సాధించుకునము అంబేద్కర్ రాసిన రాజ్యంగానీ బటి అంటరాని తనం నుండి స్వేచ్ఛ స్వాతంత్రం పొందుకున్నాం అని ఆయన చెప్పాడు ఈకార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జీ సోంపూర్ పోచిరాం మాదిగ, మహిళా సమాఖ్య కోర్ కమిటీ సభ్యులు యమునక్క మాదిగ, జిల్లా నాయకురాలు సుధ మాదిగ , మార్కెట్ కమిటీ చైర్మన్ గాయక్వాడ్ హనుమంతు మాదిగ, విజయ్ మాదిగ,సుంకిని చెందు, మండల ఇన్చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వృత్తివిద్యా జూనియర్ కళాశాలలో భారీగా పెరిగిన అడ్మిషన్లు

## జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోపాల్




ప్రత్యక్ష సాక్షి రంగసాయిపేట

హనుమకొండలోని ప్రభుత్వ వృత్తివిద్య జూనియర్ కళాశాలలో ఈ విద్యాసంవత్సరం విద్యార్థుల అడ్మిషన్లు గణనీయంగా పెరిగి 545 కు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ ఎస్. శ్రీధర్ అధ్యక్షతన అడ్మిషన్ల విజయోత్సవ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన హనుమకొండ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఏ. గోపాల్ హాజరై కేక్ కట్ చేసి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. 2008 సంవత్సరం నుంచి ఇప్పటివరకు జరిగిన అడ్మిషన్లతో పోల్చితే, ఈ సంవత్సరం రికార్డు స్థాయిలో 545 అడ్మిషన్లు నమోదు కావడం విశేషమన్నారు. ఈ మైలురాయితో హనుమకొండ జిల్లాలోనే కళాశాల ద్వితీయ స్థానంలో నిలిచిందని హర్షం వ్యక్తం చేశారు.

అడ్మిషన్ల సంఖ్యను పెంచడంలో విశేష కృషి చేసిన కళాశాల అడ్మిషన్ ఇన్చార్జ్ డాక్టర్ సవ్వాసి శ్రీనివాస్ ను శాలువాతో సత్కరించారు, అదేవిధంగా అడ్మిషన్ల పెంపుకు తోడ్పాటునందించిన ప్రిన్సిపాల్ ఎస్. శ్రీధర్ మరియు అధ్యాపక, అధ్యాపకేతర బృందాన్ని జిల్లా విద్యాధికారి ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన వృత్తివిద్యా సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ విజయోత్సవ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రేణికుంట్ల ప్రవీణ్ కుమార్,అధ్యాపకులుఅధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

3లో

# పాదాలు పదిలం

# పరగడుపునే బెల్లం నీళ్లను తాగితే ఇన్ని ఉపయోగాలు ఉన్నాయా..?



బెల్లాన్ని సహజసిద్ధమైన పద్ధతిలో తయారు చేస్తారన్న విషయం అందరికీ తెలిసిందే. అందుకనే తీపి తినాలనుకునే వారు చక్కెరకు బదులుగా బెల్లం తింటే మంచిదని వైద్య నిపుణులు కూడా చెబుతుంటారు. అయితే రోజూ బెల్లం తినడం కష్టం అనుకునే వారు బెల్లాన్ని నీటిలో కలిపి కూడా తాగవచ్చు. ఈ విధంగా బెల్లం నీళ్లను తాగడం వల్ల కూడా మనకు ఎంతో మేలు జరుగుతుందని అంటున్నారు. చిన్న బెల్లం ముక్కను రాత్రి పూట ఒక గ్లాస్ నీటిలో నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయం పరగడుపునే ఆ నీళ్లను సేవించాలి. దంతాలను తోముకున్న తరువాతే ఈ నీళ్లను తాగాలి. ఉదయం బెల్లం నీళ్లను సేవిస్తే శరీరానికి శక్తి లభిస్తుంది. రోజంతా ఉత్సాహంగా ఉంటారు. చురుగ్గా పనిచేస్తారు. శరీరంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి. నీరసం, అలసట ఉండవు.


రోగాల నుంచి రక్షణ..: బెల్లం నీళ్లను తాగడం వల్ల జీర్ణ వ్యవస్థ శుభ్రంగా మారుతుంది. జీర్ణాశయంలో ఎంజైమ్ ఉత్పత్తి పెరుగుతుంది. దీంతో తిన్న ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. జీర్ణక్రియ మెరుగు పడుతుంది. మలబద్దకం తగ్గుతుంది. బెల్లం నీళ్లను తాగడం వల్ల లివర్ శుభ్రంగా మారుతుంది. లివర్‌లోని వ్యర్థాలు, టాక్సిన్లు బయటకు పోతాయి. లివర్‌లోని కొవ్వు కరుగుతుంది. ఫ్యాటీ లివర్ ఉన్నవారు బెల్లం నీళ్లను తాగుతుంటే ఫలితం ఉంటుంది. బెల్లంలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌తో పోరాటం చేస్తాయి. కణాలు దెబ్బ తినకుండా చూస్తాయి. దీంతో క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. బెల్లంలో అనేక యాంటీ ఆక్సిడెంట్లతోపాటు మినరల్స్ కూడా ఉంటాయి. ఇవి రోగ నిరోధక వ్యవస్థను బలంగా మారుస్తాయి. దీంతో రోగాల నుంచి రక్షణ లభిస్తుంది.

రక్తహీనతకు ఔషధం..: బెల్లంలో ఉండే ఐరన్, ఫోలేట్ మహిళలకు ఎంతో మేలు చేస్తాయి. వారిలో నెలసరి సమయంలో వచ్చే నొప్పులను తగ్గిస్తాయి. తీవ్ర రక్త స్రావం జరగకుండా చూస్తాయి. అలాగే ఈ నీళ్లను తాగడం వల్ల రక్తం వృద్ధి చెందుతుంది. రక్తహీనత తగ్గుతుంది. బెల్లంలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారికి ఈ నీళ్లు ఎంతో మేలు చేస్తాయి. అలాగే బెల్లం నీళ్లను తాగితే శరీర మెటబాలిజం పెరుగుతుంది. క్యాలరీలు ఖర్చయి కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. బెల్లం నీళ్లను తాగడం వల్ల లభించే మినరల్స్ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. చర్మం కాంతివంతంగా మారి మెరిసేలా చేస్తాయి.

రాత్రి కూడా తాగవచ్చు..: బెల్లం నీళ్లను ఉదయం తాగడం వీలు కాదు అనుకునే వారు రాత్రి పూట భోజనం చేసిన తరువాత లేదా నిద్రకు ముందు తాగవచ్చు. అయితే బెల్లం శరీరంలో వేడిని పెంచుతుంది. కనుక బెల్లం నీళ్లను చల్లగా తాగితే మేలు. ఈ నీళ్లను తాగితే కొందరికి పడకపోవచ్చు.

విరేచనాలు అయ్యే అవకాశాలు ఉంటాయి. అలాంటి వారు ఈ నీళ్లను తాగకపోవడమే మంచిది. నాణ్యమైన బెల్లంతో తయారు చేసిన నీళ్లనే తాగాలి. బెల్లం క్వాలిటీగా లేకపోయినా కూడా అనారోగ్య సమస్యలు వస్తాయి. శారీరక శ్రమ లేదా వ్యాయామం చేసేవారు పని ముగిసిన తరువాత బెల్లం నీళ్లను తాగితే శరీరానికి శక్తి లభిస్తుంది. మళ్లీ ఉత్సాహంగా మారుతారు. ఇలా బెల్లం నీళ్లను సేవించడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

# గుండె ఇలా పదిలం



గుండె ఆరోగ్యం కోసం రాత్రికి రాత్రే జీవితాన్ని పూర్తిగా మార్చుకోవాల్సిన అవసరం లేదు. చిన్నచిన్న, స్థిరమైన మార్పులు.. మీ హృదయాన్ని రక్షించడంలో సహాయపడతాయి. అందుకోసం కింది చిట్కాలను పాటిస్తే సరి.. క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల నడక.. గుండె ఆరోగ్యాన్ని రెట్టింపు చేస్తుంది. నాలుకకు నచ్చేలా కాదు.. మనసుకు నచ్చేలా తినండి. జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంటూ.. కూరగాయలు, తృణధాన్యాలు, ఆరోగ్యకరమైన కొవ్వులకు ఆహారంలో చోటివ్వండి. నిద్రకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వండి. ప్రతిరోజూ రాత్రిపూట 7 నుంచి 9 గంటల నాణ్యమైన నిద్ర ఉండేలా చూసుకోండి. ధూమపానం, మద్యపానం అలవాటు ఉంటే.. వెంటనే మానేయండి. ఇంట్లో ఎవరైనా ధూమపానం చేస్తుంటే.. వారికి దూరంగా ఉండాలి.
ఒత్తిడి, భావోద్వేగాలను నియంత్రణలో ఉంచుకోవడానికి యోగా, ధ్యానం లాంటివి ప్రయత్నించండి.

# ఈ బెర్రీలను ఎప్పుడైనా తిన్నారా..?

## వీటితో కలిగే లాభాలు తెలిస్తే షాకవుతారు..!

బెర్రీలు.. ఈ పండ్ల పేరు చెప్పగానే మనకు స్ట్రాబెర్రీలు, క్రాన్ బెర్రీలు, బ్లూబెర్రీల వంటి పండ్లు గుర్తుకు వస్తాయి. కానీ బెర్రీల్లో ఇంకా అనేక వెరైటీలు ఉన్నాయి. వాటిల్లో రొవాన్ బెర్రీలు కూడా ఒకటి. ఇవి చూసేందుకు చిన్నపాటి చెర్రీ పండ్ల మాదిరిగా ఉంటాయి. ఇవి మనకు ఎక్కువగా సూపర్ మార్కెట్లలోనే లభిస్తాయి. రొవాన్ బెర్రీలను డ్రై ఫ్రూట్స్ రూపంలోనూ విక్రయిస్తారు. అయితే రొవాన్ బెర్రీలలో పారాసోర్బిక్ యాసిడ్ ఉంటుంది. కనుక ఈ పండ్లను నేరుగా తినకూడదు. కాస్త ఉడకబెట్టి లేదా డ్రై ఫ్రూట్స్ రూపంలో తినాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఈ పండ్లను నేరుగా తింటే పొట్టలో అసౌకర్యం ఏర్పడుతుందని అంటున్నారు. ఇక రొవాన్ బెర్రీలను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక లాభాలు ఉంటాయని వారు అంటున్నారు.

దయాబెటిస్ ఉన్నవారికి వరం..: రొవాన్ బెర్రీలలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను బలంగా మారుస్తుంది. రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తుంది. దీంతో శరీరం వ్యాధులను సమర్థవంతంగా ఎదుర్కొంటుంది. అలాగే ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. రొవాన్ బెర్రీలలో పాలిఫినాల్స్, ఫ్లేవనాయిడ్స్, కెరోటినాయిడ్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గేలా చేస్తాయి. దీంతో క్యాన్సర్, గుండె జబ్బులు రాకుండా అడ్డుకోవచ్చు. రొవాన్ బెర్రీలలో సార్బిటాల్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది ఆల్కహాల్‌కు చెందిన ఒక సమ్మేళనం. ఇది షుగర్ లెవల్స్ తగ్గేలా చేస్తుంది. మధుమేహం ఉన్నవారు రొవాన్ బెర్రీలను తింటుంటే షుగర్ లెవల్స్‌ను తగ్గించుకోవచ్చు. ఈ బెర్రీలు తియ్యగా ఉన్నప్పటికీ వీటిల్లో ఉండే సార్బిటాల్ కారణంగా వీటిని తింటే షుగర్ లెవల్స్ పెరగవు. పైగా షుగర్ లెవల్స్ తగ్గేలా చేస్తాయి. కనుక దయాబెటిస్ ఉన్నవారికి ఈ పండ్లను వరంగా చెప్పవచ్చు.

మలబద్దకానికి ఔషధం..: రొవాన్ బెర్రీలు సహజసిద్ధమైన లాక్సేటివ్ గుణాలను కలిగి ఉంటాయి. అందువల్ల ఈ పండ్లను తింటే మలబద్దకం తగ్గుతుంది. జీర్ణ వ్యవస్థ శుభ్రంగా మారుతుంది. రొవాన్



బెర్రీలలో ఫినోలిక్స్, టెర్పినాయిడ్స్ అనే బయో యాక్టివ్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటాయి. దీని వల్ల ఆర్థరైటిస్ నొప్పులు, వాపుల నుంచి ఉపశమనం లభిస్తుంది. కీళ్ల నొప్పులు ఉన్నవారు ఈ పండ్లను తింటుంటే ఎంతో ఉపశమనం లభిస్తుంది. రొవాన్ బెర్రీలలో యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. అందువల్ల ఈ పండ్లను తింటే మన శరీరంలో చేరే బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్‌లు నిర్మూలించబడతాయి. ముఖ్యంగా ఇ.కోలి వంటి బ్యాక్టీరియా నాశనం అవుతుంది. దీంతో అనేక వ్యాధుల రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి..: రొవాన్ బెర్రీలలో కెరోటినాయిడ్స్ అధికంగా ఉంటాయి. లుటీన్ అధికంగా ఉంటుంది. దీని వల్ల కంటి ఆరోగ్యం మెరుగు పడుతుంది. కంటి చూపు పెరుగుతుంది. వయస్సు మీద పడడం వల్ల కళ్లలో వచ్చే శుక్లాలు రాకుండా అడ్డుకోవచ్చు. రొవాన్ బెర్రీలలో విటమిన్ సి, ఫ్లేవనాయిడ్స్ అధికంగా ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి కొల్లాజెన్ ఉత్పత్తి అయ్యేలా చేస్తాయి. దీంతో చర్మంపై ఉండే ముడతలు, మచ్చలు, వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. చర్మం కాంతివంతంగా మారి మెరుస్తుంది. యవ్వనంగా కనిపిస్తారు. రొవాన్ బెర్రీలను ఆహారంలో భాగం చేసుకుంటే వాపులు తగ్గుతాయి. దీంతో గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫం కరిగిపోతుంది. ముక్కు దిబ్బడ తగ్గుతుంది. ఇలా రొవాన్ బెర్రీలను తరచూ తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.


# సంతాన సఫలతకు వడదెబ్బ

మాతృత్వ మాధుర్యాన్ని కోరుకునే స్త్రీలకు హీట్‌వేవ్ (వడగాలి) ఉపద్రవంలా మారింది. విపరీతమైన ఎండ మహిళల పునరుత్పత్తి ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని, వేడి వాతావరణం, వడగాలుల కారణంగా మానసికంగా, శారీరకంగా స్త్రీలలో ఒత్తిడి పెరుగుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు.

అధిక ఉష్ణోగ్రతలకు ఎక్కువసేపు గురికావడం వల్ల కార్టిసాల్ వంటి ఒత్తిడిని పెంచే హార్మోన్ల ఉత్పత్తి పెరగడం, స్త్రీలలో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరాన్ వంటి హార్మోన్లపై ప్రభావం చూపుతున్నట్టు పేర్కొంటున్నారు. ఈ హార్మోన్ల అసమతుల్యత కారణంగా రుతుక్రమ సమస్యలు ఉత్పన్నమవుతున్నట్టు చెప్పారు. దీని ప్రభావం అండాల విడుదల (ఓవులేషన్)పై పడుతున్నదని.. ఈ రెండు అంశాలు గర్భధారణకు సవాలుగా మారుతున్నట్టు వెల్లడించారు. వేసవిలో జరిగే ఈ మార్పులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉంటే ఇంబాలెన్సెస్ (అసమానతల)ను గుర్తించవచ్చని వైద్యులు అంటున్నారు.

వేసవిలో శరీరం నుంచి చెమట ద్వారా ఎక్కువ ఫ్లూయిడ్స్‌ను కోల్పోతారు. కాబట్టి, ఎప్పటికప్పుడు శరీరానికి అవసరమైన ద్రవ పదార్థాలను తగిన మొత్తంలో తీసుకోవాలని సూచిస్తున్నారు. వీర్యం అండాన్ని చేరడానికి సహాయపడే గర్భాశయ శ్లేష్మం హైడ్రేషన్‌పైనే ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. శ్లేష్మం తక్కువగా ఉన్నా.. లేదా మందంగా ఉన్నా.. అది వీర్యం కదలికకు ఆటంకం కలిగిస్తుందని తెలిపారు. గర్భధారణ కోరుకునే మహిళలు వడగాలుల సమయంలో ప్రతీరోజు 8 నుంచి 10 గ్లాసుల నీరు తప్పనిసరిగా తాగడం ద్వారా సంతాన సామర్థ్యం పెరుగుతుందని వైద్యులు సూచిస్తున్నారు.


నిద్ర, పౌష్టికాహారం పునరుత్పత్తికి దోహదపడే హార్మోన్లను నియంత్రించే ప్రక్రియలో నిద్ర కీలక పాత్ర వహిస్తుంది. అయితే, వేసవిలో స్త్రీలకు తగినంత నిద్రపట్టడం కష్టంగా మారుతుంది. నిద్రలేమి కారణంగా మెలటోనిన్ అనే హార్మోన్ స్థాయి తగ్గి అది అండాల విడుదలపై ప్రభావితం చూపుతుందని వైద్యులు తెలిపారు. అందుకే నిద్రపోయేటప్పుడు యూవీ కిరణాలు, సూర్యకాంతి, వేడిని నిరోధించే బ్లాక్ అవుట్ కర్టెన్లు, కాటన్ బెడ్‌షీట్లతోపాటు గది చల్లగా



ఉండేలా చూసుకోవాలి. సంతానోత్పత్తికి కంటినిండా నిద్ర కీలకమని సూచిస్తున్నారు. వేసవిలో ప్రయాణాలు కూడా కొన్నిసార్లు రుతుచక్రాన్ని దెబ్బతీస్తాయని.. ప్రయాణాలతో కలిగే ఒత్తిడి కూడా అండాల విడుదలపై ప్రభావం చూపుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వడగాలుల సమయంలో వేడి కారణంగా ఆకలి తగ్గుతుంది. దీంతో కొన్నిసార్లు తక్కువ పోషక పదార్థాలు ఉన్న ఆహారాన్ని తీసుకుంటారు. సంతానోత్పత్తి పౌష్టికాహారంపై ఆధారపడి ఉంటుంది కాబట్టి, స్త్రీలు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలని సూచిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి: ఫోలిక్ యాసిడ్, ఐరన్, జింక్, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు వంటి ముఖ్యమైన పోషకాలు ఆరోగ్యకరమైన అండాల అభివృద్ధికి దోహదపడతాయి. అందువల్ల, ఆయా కాలాల్లో లభించే పండ్లు, ఆకుకూరలు, తృణధాన్యాలు, లీన్ ప్రొటీన్లు ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. హైడ్రేటింగ్ సమస్యలను తప్పించుకోవడానికి కొబ్బరినీళ్లు క్రమం తప్పకుండా తాగాలి. వేసవిలో ఎండవేడి మానసిక ఆరోగ్యంపై సైతం ప్రభావితం చూపుతుంది. గర్భందాల్చడానికి ప్రయత్నిస్తున్న స్త్రీలు అప్పటికే భావోద్వేగ ఒత్తిడికి లోనవుతారు. అదనంగా వేసవి కారణంగా ఈ ఒత్తిడి మరింత పెరుగుతుంది. ఇలాంటప్పుడు సోషల్ మీడియాకు దూరంగా ఉండటం, మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యం ఇవ్వాలని వైద్యులు చెబుతున్నారు. ఎండలో బయటికి వెళ్లినప్పుడు సన్‌స్క్రీన్ లోషన్లు తప్పనిసరిగా వాడాలని, హైడ్రేటెట్‌గా ఉండాలని సూచించారు.

## ఈ చిట్కాలను పాటిస్తే మీ పెదవులు సహజసిద్ధంగా పింక్ రంగులోకి మారి అందంగా కనిపిస్తాయి..!



చర్మం, శిరోజాల తరువాత చాలా మంది అందంగా కనిపించాలని కోరుకునే అవయవాల్లో పెదవులు మూడో స్థానంలో ఉంటాయని చెప్పవచ్చు. మహిళలు ఎక్కువగా పెదవుల అందానికి ప్రాధాన్యతను ఇస్తుంటారు. పెదవులు అందవిహీనంగా కనిపిస్తే ఎవరికీ మనశ్శాంతిగా ఉండదు. పెదవులు పొడిబారడం లేదా నల్లగా మారడం, కాంతిని కోల్పోవడం వంటివి జరుగుతుంటాయి. ఇందుకు అనేక కారణాలుఉంటాయి. అయితే పెదవుల అందానికి ఖరీదైన బ్యూటీ పార్లర్ చికిత్సలు అవసరం లేదు. మన ఇంట్లోఉండే పదార్థాలతోనేఅత్యంత సహజసిద్ధంగా పెదవులను అందంగా మార్చుకోవచ్చు. అందుకు ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం. పెదవులను అందంగా మార్చడంలో చక్కెర, తేనె ఎంతగానో ఉపయోగపడతాయి. రెండింటినీ కలిపి పేస్ట్‌లా చేసి పెదవులపై మసాజ్ చేసినట్లు రాయాలి. దీంతో మృత చర్మ కణాలు పోతాయి. పెదవులు కాంతివంతంగా మారి అందంగా కనిపిస్తాయి. ఈ చిట్కాను వారంలో 2 సార్లు పాటించాలి.

తేనె..: పెదవులను అందంగా మార్చడంలో కొబ్బరినూనె కూడా పనిచేస్తుంది. ఈ నూనెను చాలా మంది శిరోజాల సంరక్షణకు ఉపయోగిస్తుంటారు. కానీ కొబ్బరినూనెను రాయడం వల్ల పెదవులు కూడా అందంగా మారి రక్షించబడతాయి. రాత్రి పూట నిద్రకు ముందు కొద్దిగా కొబ్బరినూనెను పెదవులకు మసాజ్ చేసినట్లు రాయాలి. ఉదయం కడిగేయాలి. ఇలా చేస్తుంటే పెదవులు మృదువుగా మారుతాయి. సహజసిద్ధమైన నిగారింపును పొందుతాయి. పెదవులు పొడిబారడం తగ్గుతుంది. తేనె పెదవులకు తేమను అందిస్తుంది. తేనెను కొద్దిగా తీసుకుని పెదవులకు రాసి 20 నిమిషాలు అయ్యాక కడిగేయాలి. రోజూ ఇలా చేస్తుంటే పెదవులు అందంగా మారుతాయి. పెదవులపై ఉండే నలుపు దనం పోతుంది. మృత చర్మ కణాలుతొలగిపోయిపెదవులు కాంతివంతంగా కనిపిస్తాయి.

బీట్ రూట్ జ్యూస్..: పెదవులపై బీట్‌రూట్ జ్యూస్‌ను అప్లై చేయడం వల్ల కూడా ఫలితం ఉంటుంది. కొద్దిగా బీట్ రూట్ జ్యూస్‌లో ముల్లంగి రసం కలిపి పెదవులపై రాసి 15 నిమిషాలు అయ్యాక కడిగేయాలి. రోజూ ఇలా చేస్తుంటే మీ పెదవులపై ఉండే నలుపుదనం తగ్గిపోతుంది. మీ పెదవులు సహజసిద్ధంగా పింక్ రంగులోకి మారుతాయి. కలబంద గుజ్జును కొద్దిగా తీసుకుని పెదవులపై రాసి 15 నిమిషాలు అయ్యాక కడిగేయాలి. కలబందలో ఉండే యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు పెదవుల వాపులను తగ్గించి ఇన్‌ఫెక్షన్లను దూరం చేస్తాయి. దీంతో పెదవులు సహజసిద్ధమైన నిగారింపును పొందుతాయి. రాత్రి పూట పెదవులపై కాస్త నెయ్యిని రాసి ఉదయం కడిగేస్తున్నా కూడా ఫలితం ఉంటుంది. అయితే నెయ్యిని ఉపయోగించే ముందు కాస్త వేడి చేస్తే మంచిది.

పాలు, గులాబీల మిశ్రమం..: రాత్రంతా గులాబీ పువ్వుల రెక్కలను పాలలో వేసి నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయం ఆ మిశ్రమాన్ని మెత్తని పేస్ట్‌లా చేయాలి. దాన్ని పెదవులపై రాయాలి. 15 నిమిషాలు అయ్యాక కడిగేయాలి. ఇలా రోజూ చేస్తుంటే పెదవులు పింక్ రంగులోకి సహజసిద్ధంగా మారిపోతాయి. రాత్రి పూట నిద్రకు ముందు పెదవులపై బాదంనూనెను రాస్తున్నా ప్రయోజనం ఉంటుంది. పెదవులు సురక్షితంగా ఉంటాయి.

ఈ విధంగా పలు చిట్కాలను పాటించడం వల్ల పెదవులపై ఉండే మృత చర్మ కణాలను తొలగించడంతోపాటు పెదవులను సహజసిద్ధంగా అందంగా మారేలా చేయవచ్చు. పెదవులపై ఉండే నలుపుదనం పోయి పింక్ రంగులోకి మారుతాయి. అయితే పెదవులు ఆరోగ్యంగా ఉండాలంటే అన్ని పోషకాలు ఉండే ఆహారాలను తీసుకోవడంతోపాటు రోజూ తగిన మోతాదులో నీళ్లను కూడా తాగుతుండాలి. దీంతో పెదవులు సురక్షితంగా ఉంటాయి.

# పాదాలు పదిలం



శరీరంలో అన్ని భాగాలపై దాడి చేసే వ్యాధి డయాబెటిస్. ఈ వ్యాధి కారణంగా రక్తంలో ఉండే అధిక చక్కెర స్థాయులు కండ్లు, కిడ్నీలు, గుండె ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేస్తాయి. అయితే, ఈ అవయవాలు మాత్రమే కాదు మధుమేహ వ్యాధిగ్రస్తుల పాదాలకు కూడా ముప్పు పొంచి ఉంటుంది. మధుమేహ వ్యాధిగ్రస్తుల్లో పాదాల సమస్యలు చాలానే ఉంటాయి. దీన్నే డయాబెటిక్ ఫూట్ అంటారు. ఈ సమస్యకు నిర్ణీత సమయంలో చికిత్స తీసుకోకపోతే పాదాల్లో పుండ్లు (అల్సర్లు) ఏర్పడతాయి. కాబట్టి, పొరపాటున కూడా డయాబెటిక్ ఫూట్ లక్షణాలను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదు.

నిజానికి మధుమేహ: వ్యాధిగ్రస్తుల్లో అధిక చక్కెర స్థాయులు కాలక్రమంలో నాడులను ధ్వంసం చేస్తాయి. దీన్ని డయాబెటిక్ న్యూరోపతి అని పిలుస్తారు. ఈ పరిస్థితిలో పాదాలకు తగినంతగా రక్త ప్రసారం జరగదు. దీంతో పాదాల్లో నొప్పి, గాయాలను గుర్తించడం కష్టమైపోతుంది. కొన్నిసార్లు ఈ గాయాలు తీవ్రమైన ఇన్ఫెక్షన్లకు దారితీస్తాయి. అవి తగ్గడానికి చాలా సమయం పడుతుంది కూడా!

లక్షణాలు: పాదాలు, వేళ్ల దగ్గర తిమ్మిర్లు, మొద్దుబారినట్టు ఉండటం. కాళ్లలో మంట లేదంటే తీవ్రమైన నొప్పి. తొందరగా నయం కాని పుండ్లు, బొబ్బలు. ఎక్కడో ఓ చోట గాయం. పాదాల చుట్టూతా ఎర్రగా కందిపోవడం, వాపు. పాదాల్లో పగుళ్లు, పొడి చర్మం, రక్తస్రావం. చర్మంపై గాఢమైన నల్లటి మచ్చలు. గాయం నుంచి దుర్వాసన, రసి కారడం. పాదాల్లో ఏదైనా అవకరం.

నివారణ ఎలా?: పాదాలను శుభ్రంగా, పొడిగా ఉంచుకోవాలి. గోళ్లు కత్తిరించుకుని, శుభ్రంగా ఉంచుకోవాలి. పాదాలపై పులిపిర్లు, గాయాలు, మంటగా ఉండటం లాంటివాటిని గమనిస్తూ ఉండాలి. పాదాలను గోరువెచ్చటి నీటితో కడుక్కోవాలి. వేళ్ల మధ్య భాగాన్ని పొడిగా ఉంచుకోవాలి. పాదాలకు అసౌకర్యంగా ఉండని తగిన షూస్‌నే ధరించాలి. ధూమపానం చేయొద్దు. ఉట్టి కాళ్లతో నడవకూడదు. వీటికి అదనంగా రక్తంలో చక్కెర స్థాయులను అదుపులో ఉంచుకోవాలి. చక్కెర స్థాయులను క్రమం తప్పకుండా పరీక్షించుకుంటూ ఉండాలి. వైద్యుడి సలహాలను అనుసరించాలి.

# మంథనిలో ఘనంగా రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి జయంతి వేడుకలు..



సత్యనారాయణ గౌడ్ ప్రత్యక్ష సాక్షి మంథని రూరల్

రాజా బహదూర్ వెంకట రామిరెడ్డి157 జయంతి వేడుకలను మంథనిలోని రెడ్డి భవన్ లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంథని రెడ్డి భవన్ ప్రాంగణంలో గల వెంకటరామిరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు.

ఇట్టి కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షులు ముస్కుల సురేందర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు మందల సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి ఏలకోరి సత్య నారాయణ రెడ్డి, సహాయ కార్యదర్శి ముసిపట్ల రమణా రెడ్డి, ఆర్థిక కార్యదర్శి మూల చంద్రశేఖర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు లెక్కల కిషన్ రెడ్డి, లంబు ప్రభాకర్ రెడ్డి, మారం సత్యనారాయణ రెడ్డి మరియు రెడ్డి సంఘం రవీందర్ రెడ్డి ప్రభాకర్ , రెడ్డి సంఘం పెద్దలు బయ్యపు మురళీధర్ రెడ్డి , బెల్లంకొండ ప్రకాశ్ రెడ్డి , లంబు సుధాకర్ రెడ్డి , బెల్లంకొండ భూమి రెడ్డి , చింతల సుధాకర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, విద్యార్థి నాయకుడు బెజ్జంకి. డిగంబర్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరిని గౌరవిద్దాం సంతోషంగా బ్రతుకుదాం

## రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పరిపాలన న్యాయమూర్తి నగేష్ భీమపాక





పల్లె సమ్మయ్య ప్రత్యక్ష సాక్షి మందమర్రి

మందమర్రి పట్టణంలో జూనియర్ సివిల్ జడ్జి ప్రారంభించారు సమాజంలో తోటి వారిని గౌరవించుకుంటూ సంతోషంగా బ్రతకాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పరిపాలన న్యాయమూర్తి నగేష్ భీమపాక అన్నారు. శనివారం జిల్లాలోని మందమర్రి పట్టణంలో ఏర్పాటు చేసిన కోర్ట్ ఆఫ్ జూనియర్ సివిల్ జడ్జ్ – కమ్ – జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు ప్రారంభ కార్యక్రమానికి మంచిర్యాల కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు ఎ.వీరయ్య, శారదా దేవి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల జిల్లా రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జ్, మందమర్రి కోర్ట్ ఆఫ్ జూనియర్ సివిల్ జడ్జ్ – కమ్ – జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు ఇంచార్జ్ జడ్జ్ కె.నిరోష, రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ, మంచిర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొత్త సత్తయ్య లతో కలిసి హాజరై గౌరవ వందనం స్వీకరించి మొక్కలు నాటిన అనంతరం మూడు మతాల పెద్దల సమక్షంలో కోర్టు భవనాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పరిపాలన న్యాయమూర్తి మాట్లాడుతూ కోర్టు భవనాన్ని ప్రారంభించే కార్యక్రమాన్ని పండుగలా జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ పక్కవారిని గౌరవించాలని, సమాజంలో గొడవలకు, కేసుల నమోదుకు మనలోని అహం ప్రధాన కారణమని, ప్రతి ఒక్కరు ఒక్క క్షణం ప్రశాంతంగా ఆలోచిస్తే ఎలాంటి గొడవలకు అవకాశం ఉ ండదని తెలిపారు. మన ధర్మాలు, గ్రంధాల ప్రకారం ప్రజలలో శాంతి లేకపోవడమే శాంతి భద్రతల విఘాతానికి ప్రధాన కారణమని, ప్రతి ఒక్కరూ సోదర భావంతో మెలగాలని తెలిపారు. న్యాయస్థానాలలో కేసులలో వాయిదా కాలాన్ని తగ్గించి త్వరగా పరిష్కరించే విధంగా కృషి చేయాలని తెలిపారు. ప్రజలు చిన్న చిన్న విషయాలను పట్టించుకోకుండా అందరితో స్నేహభావంతో మెలగాలని, చైతన్యవంతంగా, శక్తివంతంగా, ఆనందంగా బ్రతకాలని తెలిపారు. సింగరేణి కార్మికుల గురించి మాట్లాడుతూ చీకటిలో భూమి పొరల్లో చెమటోడ్చి కష్టపడి దేశానికి వెలుగులు నింపుతున్నారని, వారి శ్రమ గుర్తించదగినదని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మందమర్రి, బెల్లంపల్లి పట్టణాలలో కోర్టు భవనాలను ప్రారంభించడం ద్వారా కేసుల పరిష్కారం మరింత వేగవంతం అవుతుందని తెలిపారు. జిల్లాలో అవసరమైన న్యాయస్థానాలు, న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ప్రభుత్వ ప్లీడర్లు, అందుబాటులో ఉన్నారని, కేసుల పరిష్కారంలో తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని కలెక్టర్ తెలిపారు.అంతకుముందు మందమర్రి మండల కేంద్రంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈకార్యక్రమంలోన్యాయస్థానాల అధికారులు,సిబ్బంది, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, సంబంధిత అధికారులు,పాల్గొన్నారు.

# మెగాస్టార్ చిరంజీవి 71వ పుట్టినరోజు వేడుకలలో పాల్గొన్న ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్..

ఎమ్. లక్ష్మి – ప్రత్యక్ష సాక్షి (కూకట్ పల్లి )

ఈ రోజు కూకట్పల్లి నియోజక వర్గం కె పి హెచ్ బి కాలని 9 వ ఫేస్ లో మెగా అభిమానుల మహేష్ , శేషాద్రి నాయుడు ఆధ్వర్యంలో పద్మవిభూషణ్ మెగాస్టార్ చిరంజీవిలి పుట్టిన రోజు సందర్భంగా జరిగిన కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా కూకట్పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ ప్రేమ్ కుమార్ పాల్గొని మెగా అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి , అన్నదాన కార్యక్రమం లో పాల్గొని,చిరంజీవి కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయుకులు కొల్లా శంకర్, వేముల మహేష్ ,పోలేబోయిన శ్రీనివాస్, అశోక్ మాదాసు గంగాధర్ మెగా స్టార్ చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.








# మొయ్య లావణ్య ట్రస్ట్ ద్వారా 25 కిలోల బియ్యం అందజేత

పల్లె సమ్మయ్య ప్రత్యక్ష సాక్షి మందమర్రి

మందమర్రి మేడారం చెందిన దుర్గం శివ తండ్రి అకాల మృతి చెందడం జరిగిందని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ మొయ్య లావణ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వారి కుటుంబానికి 25 కిలోల బియ్యం ఇవ్వడం జరిగిందని ట్రస్ట్ చైర్మన్ మొయ్య రాంబాబు. తెలిపారు. నిరుపేదలకు సాయం చేయడానికి ఎల్లప్పుడూ మా ట్రస్టు ముందుంటుందని ఆయన అన్నారు. ట్రస్ట్ వైస్ చైర్మన్ శివమణి కొప్పుల రమేష్ చొప్పరి లక్ష్మణ్,గోగుల శంకర్, కోట శ్రీనివాస్, శంకర్,వెంకటేష్, పలువురు, పాల్గొన్నారు.



# ఇండియన్ ఆర్మీ గొడుగు గంగాధర్ పదవి విరమణ

యాదవరావు ప్రత్యక్ష సాక్షి పోతంగల్

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం లో శనివారం రోజున హంగర్గా గ్రామ నివాసి గొడుగు గంగాధర్ ఆర్మీ జవాన్ గా గత 15 సంవత్సరాలు దేశం కోసం సేవ చేసి ఈరోజు పదవి విరమణ కార్యక్రమాన్ని చేసుకోవడం జరిగింది ఈ సందర్భంగా హంగర్ గా గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది మారుమూల గ్రామం నుండి ఆర్మీగా సేవలందించి ఈరోజు పదవి విరమణ చేసుకుని గ్రామస్తులకు విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు ఈ పదవి విరమణ కార్యక్రమం మా గ్రామ ప్రజలందరికి ఎంతో గర్వకారణంగా భావిస్తున్నాం ఈ కార్యక్రమంలో గొడుగు గంగాధర్ వారి యొక్క కుటుంబ సభ్యులు వారి యొక్క రక్తసంబంధీకులు స్నేహితులు బంధువులు తదితరులు పాల్గొన్నారు..

# రామగిరి తహసీల్దార్ కార్యాలయంలో అధికారుల నిర్లక్ష్యం..

## డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గొర్రెంకల సురేష్



లక్ష్మణ్ ప్రత్యక్ష సాక్షి మంథని

రామగిరి మండల తహసీల్దార్ కార్యాలయం ఆ ప్రాంతంలో భూరికార్డుల నిర్వహణ ప్రజలకు సేవలు అందించడంలో కీలక పాత్ర పోసించాల్సింది పోయి సర్టిఫికెట్ ల కోసం వెళ్లిన సామాన్యల మీద మాటల విమర్శలు ప్రదర్శించడంతో పాటు కుల,ఆదాయ, నివాస, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలను తిరస్కరిస్తూ సామాన్యలను తమ కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని రామగిరి మండల తహసీల్దార్ కార్యాలయంలో కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్న రైతులు,పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అవసరమైన అన్ని ఆధారాలు జత పరిచిన ఎమ్మార్వో కేవలం ఆర్ అండ్ బి ప్యాకేజ్ కోసమే అంటూ దరఖాస్తు లను రిజెక్ట్ చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు.

గత కొన్ని రోజులుగా రామగిరి మండలం పలు గ్రామాల్లోని పలువురు రైతులు, భర్తను కోల్పోయిన మహిళలు తమకు వచ్చే లేబర్ ఇన్సూరెన్స్ కోసం మీ సేవ ద్వారా లేదా మన్వాల్ ద్వారా దరఖాస్తు చేసుకున్న నెలలు గడిచిన తర్వాత సంబంధిత రెవెన్యూ ఇన్స్పెక్టర్ లు గ్రామ పాలన ఆఫీసర్ లు ఆకారణంగా ఎమ్మార్వో లాగిల్లో రిజెక్ట్ అవుతున్నాయని అంటు సామాన్యులను కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. పొలం పనులు వదిలి నెలలు తరబడి తిరుగుతున్నా సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం వల్ల తమ నష్ట పోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేద, మధ్య తరగతి ప్రజలకు మహిళకు అత్యవసరమైన కుటుంబ సభ్యులు ధ్రువీకరణ సర్టిఫికెట్ ఇవ్వకపోవడం వల్ల వారు ప్రభుత్వ పథకాలు, ఇతర అవసరాలకు దూరమవుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా కళ్యాణ లక్ష్మికి నోటరీ ఇవ్వాలని రామగిరి ఎమ్మార్వో హుకుంజారి నోటరీలు లేని కల్యాణ లక్ష్మి అప్లికేషన్లను తిరస్కరించడం జరుగుతుంది ఈ విషయం పై జిల్లా కలెక్టర్ స్పందించి రామగిరి ఎమ్మార్వో కార్యాలయంలో జరుగుతున్న జాప్యంపై విచారణ జరిపి సమయానికి సర్టిఫికెట్లు జారిచేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డిమాండ్ చేసారు.

# హత్య కు గురైన రూపారెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



యాదవరావు ప్రత్యక్ష సాక్షి పోతంగల్

నల్గొండ జిల్లాలో నాగార్జున పాఠశాల ప్రిన్సిపల్ రూపరెడ్డిని దారుణంగా హత్య చేసిన ఘటనలో ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు శనివారం కోటగిరి మండల కేంద్రంలో శ్రీ వేద పాఠశాల ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ రాస్తారోకో నిర్వహించారు పాఠశాల నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించి రోడ్డుపై బైఠాయించారు విద్యార్థులకు విద్యాబుద్ధులను నేర్పిన ఉపాధ్యాయులను హత్య చేయడం బాధాకరం అన్నారు తల్లిదండ్రులు ఇప్పటికైనా తమ వైఖరిని మార్చుకోవాలి అన్నారు విద్యార్థులను దండించడం వల్ల ఉపాధ్యాయుల పై కక్షను పెంచుకొని ఇలాంటి పనులు చేపట్టడం బాధాకరం అన్నారు తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు స్వేచ్ఛని ఇవ్వడంతో పాటు క్రమశిక్షణ విషయంలో సహకరించాలి అని కోరారు..

ప్రైవేటు బడులకు ఉపాధ్యాయులకు రక్షణ కల్పించడంతో పాటు చట్టం తీసుకొని రావాలి అని డిమాండ్ చేశారు ఈ నిరసన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ తెల్ల అక్షర ఉపాధ్యాయ బృందం సాయి పవన్ సాయినాథ్ నాగరాజు రాము రమేష్ భీమ్రావు నఫీజ్ చంద్రకళ సంగీత పూజ సుప్రియ గంగాసాగరి ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# వరంగల్ వెస్ట్ నియోజకవర్గ 2వ విడత శిక్షణ శిబిరం..

## ముఖ్య అతిథిగా పాల్గొన్న డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి



సాయి... ప్రత్యక్ష సాక్షి వరంగల్ బ్యూరో చీఫ్

హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వరంగల్ వెస్ట్ నియోజకవర్గ ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్ ఫేజ్–2) పై శిక్షణ శిబిర కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మరియు గోదాదేవి ఆధ్వర్యం లో ఈ శిక్షణ ప్రక్రియ విజయవంతంగా జరిగింది. ఈ సమీక్ష సమావేశంలో ముఖ్య అతిథిగా హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, టీపీసీసీ పార్లమెంట్ కోఆర్డినేటర్ నజీర్ హాజరయ్యారు. కార్యక్రమంలో టీపీసీసీ మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పల్లె శ్రీనివాస్ గౌడ్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, భట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేసే దిశగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రత్యర్థులపై ఒత్తిడి తెచ్చే జేబు సంస్థలుగా మార్చుకుందని ఆరోపించారు. ఈడీ నిర్వహించిన దాడుల్లో 90 శాతానికి పైగా ప్రతిపక్ష పార్టీల నేతలపైనే జరిగాయని పేర్కొన్నారు. ప్రతి పౌరుడి ఓటు హక్కును రక్షించడం కాంగ్రెస్ పార్టీ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు.ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు గత రెండున్నర నెలలుగా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేస్తున్నారని తెలిపారు. బీఎల్ఏల లిస్ట్ లను సమర్పిస్తే ఎన్నికల సంఘం నమోదు చూపించడం పలు అనుమానాలకు తావిస్తోం దన్నారు.ప్రతి ఓటరు తమ ఓటు నమోదును తప్పనిసరిగా పరిశీలించుకుని, అవసరమైతే సవరణలు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వరంగల్ వెస్ట్ లో సుమారు 20 శాతం ఓట్లు తొలగించబడగా, ఇతర ఓట్లకు నోటీసులు జారీ చేయడం ఆందోళనకర పరిణామమని పేర్కొన్నారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 18 ఏళ్ల యువతకు ఓటు హక్కు కల్పించి ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేశారని గుర్తు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు పునాది అని, ప్రతి ఓటు విలువైనదని అన్నారు.ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు పరిరక్షించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని సమావేశంలో నాయకులు అభిప్రాయపడ్డారు.

# మెట్ పల్లి ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కోరుట్ల ఎమ్మెల్యే డా కల్వకుంట్ల సంజయ్

డి సుధాకర్ ప్రత్యక్ష సాక్షి మెట్‌పల్లి టౌన్

జగిత్యాలజిల్లా మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రిని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్య సిబ్బంది పనితీరు పారిశుద్ధ్యం ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన రోగులతో ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడి, వైద్య సేవలు ఎలా అందుతున్నాయి ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, అవసరమైన మందులు మరియు వైద్య పరీక్షలు అందుతున్నాయా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు ఆసుపత్రిలో రక్త పరీక్షలు, ఎక్స్‌రే సేవలు సక్రమంగా అందడం లేదని పలువురు రోగులు ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎమ్మెల్యే సంజయ్ గారు వెంటనే డీఎంహెచ్ఓతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు ఆసుపత్రిలో అవసరమైన అన్ని వైద్య పరీక్షలు, ముఖ్యంగా రక్త పరీక్షలు మరియు ఎక్స్‌రే సేవలు నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు రోగులకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్యం అందించడమేహౌహాలక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు



వైద్యం కోసం వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు ఆసుపత్రిలో అవసరమైన మౌలిక వసతులు, వైద్య పరికరాలు, మందులు తదితర సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే సంజయ్ గారు తెలిపారు రోగులకు అందుతున్న సేవల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా నిరంతరం పర్యవేక్షిస్తామని స్పష్టం చేశారు.



# బైక్ అదుపుతప్పి తీవ్రగాయాల పాలైన యువకుడు

యాదవరావు ప్రత్యక్ష సాక్షి పోతంగల్

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం హంగర్గా గ్రామ శివారులో రుద్రూర్ గ్రామానికి చెందిన గంగారాం రోడ్డు పై నుండి అదుపు తప్పి పడిపోయి తీవ్ర గాయాల పాలైన యువకుడినీ 108 అంబులెన్స్ లో ప్రభుత్వ ఆసుపత్రి బోధన్ కు తరలించారు

printed,published and owned by Kandukuri Parameshwar Rao, printed at Rimsha printers,. H .no 5-16/1, Algunoor,Mandal Thimmapur, Dist Karimnagar (TS) place of Publication H.NO.1-2-31/4/B/1 krishna nagar jagital dist(TS).cell no.99892 88546, Editor K.Parameshwar rao. RNI No.APTEL/2011/38267. kprao1961@gmail.com